
ప్రజాశక్తి

గురువారం 20 జూన్ 2024



వేధింపులకు గురిచేశారంటూ ఎంఇఒలపై మహిళా టీచర్ ఫిర్యాదు

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

ఎంఇఒలు నాగభూషణరావు, శ్రీనివాసరావు తనను వేధింపులకు గురిచేశారని మండలంలోని చినతుంబలి ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయురాలు ఆర్‌జెడికి ఫిర్యాదుచేశారు. ఈ విషయమై తొలుత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించక పోవడంతో ఆర్‌జెడి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు. దీంతో ఆర్‌జెడి ఆదేశాల మేరకు పాలకొండ డిప్యూటీ డిఇఒ పి.కృష్ణమూర్తి బుధవారం జియ్యమ్మవలస ఎంఆర్‌సి కార్యాలయంలో ఎంఇఒలపై దర్యాప్తు నిర్వహించారు. నాడు-నేడు పనులపై ఎంఇఒ శ్రీనివాసరావు డబ్బులు అడిగారని, అందుకు అంగీకరించక పోవడంతో వేధింపులకు గురిచేస్తున్నారని మహిళా టీచర్ ఆరోపించారు. తమపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని ఎంఇఒ తెలిపారు.

ఫీజులుం

- ప్రయివేటు విద్యాసంస్థల దోపిడీ
- తల్లిదండ్రులపై మోయలేని భారాలు
- ఏటా పది శాతం పెంపు

జీవో నెంబరు 53 ప్రకారం 1 నుంచి 10 తరగతి వరకూ చదువుతున్న పిల్లలకు గ్రామీణ ప్రాంతాలలో రూ.10 వేలు, పట్టణాల్లో 15 వేలు, నగరాల్లో 20 వేలు ఫీజులు వసూలు చేయాలని గత వైసిపి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ప్రయివేటు యాజమాన్యాలు కోర్టుని ఆశ్రయించి సంబంధిత జిఒను రద్దు చేయించాయి. దీంతో తమ ఇష్టారాజ్యంగా ఫీజులతో బాటు బస్సు ఛార్జీలు, పుస్తకాలు ఇలా రకరకాలుగా ఏడాదికి రూ. వేలల్లో, కొన్ని స్కూళ్లలో లక్షల్లో వసూలు చేసుకుని జేబులు నింపుకుంటున్నాయి. అయినా విద్యా శాఖ అధికారులు మాత్రం తమకు ఏమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధులు సైతం దీని గురించి పట్టించుకోవడం లేదు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్




జిల్లాలో పాఠశాలన్నీ ఈనెల 13 నుంచి పున:ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలుకు పాల్పడుతున్నాయి. అడ్డూ అదుపూ లేకుండా అధిక మొత్తంలో కలెక్షన్లు చేస్తున్నాయి. ఏటా ఇదే తంతు కొనసాగుతున్నా పట్టించుకోని అధికారుల తీరుపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో సుమారు 500కు పైగా ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. వీటిల్లో దాదాపు 2 లక్షల మంది ఏటా చదువుతున్నారు. పలు విద్యాసంస్థల్లో నియంత్రణ లేని ఫీజులను వసూలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లే స్కూల్, నర్సరీ, ఎల్‌కెజిలకు రూ.10 వేల నుంచి రూ.20 వేలు, 1 నుంచి 5 వరకూ రూ.15 వేల నుంచి రూ.35 వేలు, 6 నుంచి 10 వరకూ రూ.30 వేలు నుంచి లక్ష వరకూ కూడా వసూలు చేసే కార్పొరేట్ పాఠశాలలున్నాయి. అలాగే బస్సు, యూనిఫామ్, పుస్తకాలు ఇలా రకరకాల పేర్లతో ఫీజుల వసూలు జరుగుతోంది. ఫీజుల విషయంలో నిబంధనలు పాటించడం లేదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ మండిపడుతున్నారు. పైగా ఫీజు చెల్లిస్తేనే పుస్తకాలు ఇస్తామంటూ కార్పొరేట్ సూళ్లవిద్యార్థులపైనా, తల్లిదండ్రులపైనా ఒత్తిడి చేస్తున్నాయి.

1994లో వచ్చిన జిఒ నెంబర్ 1 ప్రకారం ప్రయివేటు పాఠశాల ప్రిన్సిపల్, విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఇద్దరితో ఒక కమిటీని నియమించాలి. వసూలు చేసిన ఫీజులో ఐదు శాతం యాజమాన్యం, మిగిలిన మొత్తం పాఠశాల అభివృద్ధి, ఉద్యోగుల, సిబ్బంది వేతనాలు, వారికి బీమా, పాఠశాల నిర్వహణకు వ్యయం చేయాలి. 2008లో విడుదల చేసిన 90, 91, 92 జిఒల ప్రకారం జిల్లా విద్యాశాఖ అధికారి, ఒక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, ప్రయివేటు విద్యాసంస్థల ప్రతినిధులతో ఒక కమిటీని జిల్లా ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో నియమించాలి. అయితే జిల్లాలో ఇవి ఎక్కడా అమలు కావడం లేదు.

కానరాని సౌకర్యాలు

పలు విద్యాసంస్థలు అపార్టుమెంట్లు, రేకుల షెడ్లలో తరగతులను నిర్వహిస్తున్నాయి. గాలి, వెలుతురు వచ్చే విశాలమైన తరగతి గదులు ఎక్కడా కానరావడం లేదు. ఉపాధ్యాయులకు అర్హతలతో పని లేకుండా ఎవరు ఎక్కువ విద్యార్థుల్ని పాఠశాలల్లో చేర్పిస్తే వారికే ఎక్కువ జీతాలు (ఇంక్రిమెంట్లు) ఇస్తున్నారు. ఇక ప్రీ స్కూల్, టెక్నో, ఈ-టెక్నో, సి-బ్యాస్, ఎస్.బ్యాచ్, ఐపిఎల్, ఒలింపియాడ్ తదితర తోకలను పాఠశాల పేర్లకు ముందో వెనకో తగిలించి రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. గుర్తింపు లేదని, వసతులు సక్రమంగా లేవని ఒకవేళ అధికారులు పాఠశాలలపై చర్యలకు ఉపక్రమిస్తుంటే రాజకీయ నాయకుల ప్రోద్బలంతో తిరిగి పాఠశాలల్ని తెరుస్తున్నారు. దీంతో అధిక ఫీజుల వసూళ్లు, పుస్తకాలకు రూ.5వేలు నుంచి 20వేలు వరకు, 500 విలువ చేసే రెండు జతలు దుస్తులకు రూ.2500 వసూలు చేస్తున్నారు. వీటిని ఆయా పాఠశాలల్లోనే తప్పనిసరిగా కొనాల్సిందే అనే నిబంధనలపై తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి పాఠశాలలో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలి. కానీ ఇది జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. అధికారులు మాత్రం నామమాత్రపు తనిఖీలు చేస్తూ సౌకర్యాలు లేకున్నా, పాఠశాలల యజమానులు నిబంధనలు పాటించకున్నా అన్నీ ఉన్నట్టే అనుమతులు మంజూరు చేస్తున్నారు. దీంతో ప్రైవేటు,కార్పొరేట్ పాఠశాలలు యాజమాన్యాల ఫీజుల దోపిడీకి అడ్డులేకుండా పోతోంది.

పిల్లల చదువు పెద్ద భారంగా మారింది



పిల్లల్ని చదివించడం పెద్ద భారంగా మారింది. ఇద్దరు పిల్లల్ని ప్రైవేటు స్కూల్లో చేర్పించాం. పెద్ద అమ్మాయి 9 వ తరగతి, చిన్న అమ్మాయి 7 వ తరగతి ఇద్దరికీ కలిపి ఫీజులు, పుస్తకాలు, యూనిఫారాలు, షూ, బెల్టు అన్నీ కలిపి లక్షరూపాయలు ఖర్చయ్యింది. గత ఏడాది కంటే ఈ ఏడాది ఐదు వేలు అదనంగా ఫీజులు పెంచేయడం దారుణం. ఫీజులు కట్టలేము అంటే మానిపించేయమని స్కూల్ యాజమాన్యం చెబుతోంది.

- ఎస్.ఆదిలక్ష్మి, పావనీనగర్, విజయనగరం



మంత్రి సంధ్యారాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెండో ఎఎన్ఎంలు

హెల్త్ వాలంటీర్లను కొనసాగించండి

గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణికి వినతి

ప్రజాశక్తి-సాలూరు

గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోను, పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లోను పనిచేసిన ఆదివాసీ ఆరోగ్య హెల్త్ వాలంటీర్‌లను కొనసాగించాలని పలువురు గిరిజన సంఘాల నాయకులు, హెల్త్ వాలంటీర్‌లు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కోరారు. ఈమేరకు మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎఎన్ఎంల నియామకంలో మొదటి ప్రాధాన్యత గతంలో పనిచేసిన వారికి ఇస్తామని హామీ ఇచ్చారు. ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణం, ఉద్యోగుల ఉద్యోగ భద్రత, గురుకుల కళాశాలల్లో సీట్లు పెంపు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాలక రంజిత్ కుమార్, పల్ల సురేష్, పాలవలస భగవాన్, ఇంటికొప్పల రామకష్ణ, ఆరిక చంద్రశేఖర్, ఆరిక ప్రభాకరరావు, చెల్లూరి సీతారాం, పడాల తమ్మయ్య, హెల్త్ వాలంటీర్ లు వెంకట లక్ష్మి, లక్ష్మి,భారతి, సంతోషి, అరుణ, జ్యోతి, గౌరి, ఎరుకలమ్మ, పద్మ,ప్రియాంక పాల్గొన్నారు.

గతంలో పనిచేసిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

సీతంపేట : గతంలో గిరిజనసంక్షేమ వసతి గృహాల్లో పనిచేసిన ఆరోగ్య కార్యకర్తలను విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్రమంత్రి సంధ్యారాణికి పోస్టుమెట్రిక్ హాస్టల్స్ ఆరోగ్య కార్యకర్తల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బిడ్డిక రామమోహనరావు కోరారు. మంత్రిని కలిసి వినతి అందజేశారు.

మక్కువ : మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న రెండవ ఎఎన్ఎం లు మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. గత 18 ఏళ్లుగా వైద్య సేవలందిస్తున్నామని, తమను ప్రభుత్వం రెగ్యులర్ చేసేలా కృషి చేయాలని కోరారు.

గుమ్మలక్ష్మీపురం : గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ని గుమ్మలక్ష్మీపురం మండల టిడిపి నాయకులు కలిసి అభినందించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, నాయకులు వెంపటాపు భారతి, కద్రక కళావతి, జమ్మయ్య, తులాల రవి, ఎన్ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణిని కలిసిన వీరేష్ చంద్రదేవ్

కురుపాం : గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని సాలూరులో తన నివాసం వద్ద బుధవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేష్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. మంత్రిని కలిసిన వారిలో కురుపాం టిడిపి నాయకులు జీవి రమణమూర్తి, కర్రి శ్రీను, సుఖేష్ చంద్రపండ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు అన్యాయం

ప్రజాశక్తి కొమరాడ

మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ జోక్యంతో కక్షసాధింపులకు పాల్పడటం అన్యాయమని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. తొలగించిన మధ్యాహ్న భోజన పథక కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్‌లో ఒక్కరోజు తప్పు చేశారని ఆరు నెలల తర్వాత మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. త్రిసభ్య కమిటీ నివేదిక ఇచ్చారని, ఈ సందర్భంగా పాతవారిని తొలగించామని కలెక్టర్ నుండి తమకు నివేదిక వచ్చిందని హెచ్ఎం చెప్పడం దారుణమన్నారు. రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులను ఎలా కొత్తగా నియమించారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మిడ్ డే మీల్స్ కార్మికులు సావిత్రమ్మ, సీత, గంగమ్మ, స్వామి నాయుడు పాల్గొన్నారు.

22న పాలకొండలో జాబ్‌మేళా

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఈ నెల 22న పాలకొండ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఆర్. వహీదా ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో టైర్స్‌లో 150 ఉద్యోగాలు, మోడెలెజ్ ఇండియా ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 80 ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అపోలో టైర్స్ సంస్థలో 150 నేషనల్ అప్రెంటిస్ షిప్ ప్రమోషన్ స్కీమ్ (ఎన్ఎపిఎస్) ఉద్యోగాలకు 18 నుంచి 23 ఏళ్ల వయస్సు కలిగి 2020-24 బ్యాచ్‌కు చెంది, ఏదైనా డిప్లొమా, బి.టెక్, డిగ్రీలో విద్యార్హత కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మోడెలెజ్ ఇండియా ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 80 ట్రైనీస్ ఉద్యోగాలకు 18 నుండి 21 ఏళ్ల వయస్సు కలిగి ఇంటర్మీడియట్‌లో 50 శాతం ఉత్తీర్ణత సాధించిన స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత మరియు ఆసక్తి గల అభ్యర్థులు https://employment.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవలెనని పేర్కొన్నారు. వివరాలకు 9908827160 నంబర్‌ను సంప్రదించవచ్చునని చెప్పారు.

వరుణుడి కోసం రైతుల ఎదురుచూపులు



వరుణుడు కోసం ఎదురు చూస్తున్న రైతు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఈ ఏడాది ఖరీఫ్‌లో వ్యవసాయ పనులు ప్రారంభానికి సరైన వర్షాలు లేవు. దీంతో ఖరీఫ్ ఆలస్యం అయ్యేటట్లు ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జూన్ నెల ప్రారంభమై 20 రోజులు దాటినా ఎండలు మండిపోతున్నాయి. రోజువారి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు పైబడి నమోదవుతున్నాయి. చిన్నపాటి వర్షాలు కురిసిన మండుతున్న ఎండలతో వ్యవసాయ పనులు ప్రారంభానికి ఏమాత్రమూ అనుకూలంగా లేవని రైతులు చెబుతున్నారు.

మన్యం జిల్లాలో పొలం పనుల ప్రారంభానికి రైతులు దుక్కులు వేశారు. సరైన వర్షాలు లేకపోవడంతో విత్తనాలు చెల్లలేదు. వరుణుడి కరుణ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ నెల ప్రారంభంలోనే రుతుపవనాల వచ్చాయని, తొలకరి చినుకులు కురుస్తాయని ఉద్దేశంతో పది రోజుల కిందట వరి దుక్కులు ప్రారంభించారు. మూడు రోజులుగా ఉదయం వేళ మబ్బులు రైతులను ఊరిస్తున్నాయి. 10 గంటల దాటాక అధిక ఉష్ణోగ్రతలతో ఎండలు మండిపోతున్నాయి. దీంతో చెరువులు, కాలవలు అడుగుంటాయి. నీటి చుక్క కరువైంది. సకాలంలో వర్షాల కురవకుంటే ఖరీఫ్ పనులు ఆలస్యమయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో గిరిజన రైతులు వర్షాధారంపై ప్రతి ఏడాది ఖరీఫ్ సాగు చేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవకుంటే కరువు తప్పదని ఆందోళన చెందుతున్నారు. మైదాన ప్రాంతాల్లో ఉన్న జియ్యమ్మవలస, గరుగుబిల్లి, కొమరాడ మండలాల్లో సాగునీటి ప్రాజెక్టులున్నా భారీగా వర్షాలు కురిస్తే తప్ప పంట పొలాలకు నీరందని పరిస్థితి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతులకు వరి, పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేసింది. ఖరీఫ్ సాగు వేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నా వర్షాలు ఎప్పుడు పడతాయా? అని ఆశతో ఎదురుచూస్తున్నారు.



వినతి అందిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు

జ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

జిల్లాలో గిరిజన ప్రాంతంలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి, మలేరియా, జ్వరాల నివారణకు వైద్యశాఖ తక్షణమే చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఇమ్యూనిటీ అధికారి నారాయణరావును కలిసి వినతి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షా కాలం వచ్చిందంటే ఏటా ఏజెన్సీలో వైరల్ జ్వరాలు, మలేరియా విజృంభిస్తున్నాయని తెలిపారు. వైద్యం కోసం ఆసుపత్రికి వస్తున్న వారి సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. పిహెచ్‌సిల్లో 30 పడకలు ఉంటే, 40 మంది వరకూ ఇన్‌పేషెంట్లు ఉంటున్నారని, రోగాల తీవ్రతకు ఇది అద్దం పడుతోందని చెప్పారు. ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు రోగాల బారిన పడ్డారని వివరించారు. ఆస్పత్రిలో సరిపడా సిబ్బంది లేరని తెలిపారు. మలేరియాకు సంబంధించిన మందులు, ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, వెంటనే దోమతెరలు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బంటు దాసు, గొర్లి వెంకటరమణ, పి.రాము తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవులు, జగదీశ్‌పై చర్యలు తీసుకోవాలి

టిడిపి నాయకుల డిమాండ్

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

నియోజకవర్గంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్‌పై అధిష్టానం చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ప్రయివేటు ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేకు వైసిపి అభ్యర్థికి, ఎమ్‌పికి బిజెపి అభ్యర్థికి క్రాస్ ఓటింగ్ చేసేలా మాజీ ఎమ్మెల్సీ జగదీశ్, ఆయన కుటుంబం ప్రోత్సహించారని ఆరోపించారు. అందుకు ఆధారాలు కూడా తమ వద్ద ఉన్నాయని చెప్పారు. పార్టీకి ద్రోహానికి పాల్పడిన వీరిని తక్షణమే తొలగించాలని ఈ సమావేశం ద్వారా ఏకగ్రీవంగా తీర్మానించారు. దీన్ని అధిష్టానానికి పంపిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, చీకటి బద్రి, నారాయణరావు, మజ్జి వెంకటేష్, బార్నాల సీతారాం, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న చేయూత పథకం లబ్ధిదారులు

'చేయూత' డబ్బులు ఎక్కడ?

ఎంపిడిఒ కార్యాలయం ఎదుట లబ్ధిదారుల నిరసన

ప్రజాశక్తి-బలిజిపేట

జగనన్న చేయూత డబ్బులు ఎక్కడ ఉన్నాయని, వెంటనే సంబంధిత అధికారులు తెలియజేయాలని లబ్ధిదారులు ప్రశ్నించారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయం కార్యాలయం ఎదుట జగనన్న చేయూత లబ్ధిదారులు నిరసన చేపట్టారు. అనంతరం ఇఒపిఆర్‌డికి వినతి అందించారు. వీరికి సిపిఎం మండల నాయకులు బొద్దాన భానుమూర్తి మద్దతు తెలిపి, మాట్లాడారు. మండలంలో చాలా మందికి జగనన్న చేయూత పథకం ద్వారా అందాల్సిన రూ.18,750 బ్యాంకు ఖాతాల్లో జమకాక పోవడంతో గడిచిన రెండు నెలల నుంచి బ్యాంకులు, సచివాలయాలు, వెలుగు కార్యాలయం చుట్టూ పనులు మానేసి తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలో ఇంకా 75 శాతం మందికి పైగా డబ్బులు జమ కావాల్సి ఉందన్నారు. కొత్తగా ఎన్‌డిఎ ప్రభుత్వం కొలువు దీరడంతో తమకు చేయూత పథకం ద్వారా రావాల్సిన డబ్బులు వస్తాయో, రావోనని ఆందోళన చెందుతున్నారని చెప్పారు. దీనిపై సంబంధిత అధికారులు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి యమ్మల మన్మథరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలి

ప్రజాశక్తి-కొమరాడ

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 39వేల టీచర్ పోస్టులు భర్తీ చేయడంతోపాటు స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు హిమరిక రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొమరాడలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సభలో సిఎం చంద్రబాబు హామీ మేరకు ఏజెన్సీ ప్రాంతంలో నియామకాలకు సంబంధించి జిఒ 3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో విద్యాబోధన చేస్తున్న భాషా వాలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు వెంకటేష్, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పాల్గొన్నారు.

తాగునీరు వృథా

ప్రజాశక్తి-పార్వతిపురం టౌన్

పట్టణంలోని బెలగాం ప్రధాన రహదారిలో కలెక్టర్ కార్యాలయానికి సమీపంలో ప్రధాన పైపులైన్ లీకుల వల్ల తాగునీరు వృథాగా పోతోంది. జిల్లా కేంద్రాస్పత్రి జంక్షన్ వద్ద, జిల్లా ప్రభుత్వ కార్యాలయాల సముదాయం పక్కన తాగునీరు వృథా అవుతోంది. ఉన్నతాధికారుల కార్యాలయాల వద్ద తాగునీరు వృథాగా పోతూ రోడ్డుపై చేరుతున్నా ఎవరూ పట్టించుకోక పోవడం గమనార్హం. అధికారుల తీరుపై పట్టణవాసులు, వాహనదారులు మండిపడుతున్నారు.



బస్సులో ఇరుకిరుకుగా కూర్చున్న విద్యార్థులు

నిబంధనలు తూచ్

- ప్రయివేటు పాఠశాల బస్సులో పరిమితికి మించి విద్యార్థులు
- సీట్ల మధ్య చెక్కలు ఏర్పాటు
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి-మక్కువ

ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు తుంగలో తొక్కుతున్నాయి. పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో తరలిస్తున్నాయి. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మక్కువ మండలం నుంచి బొబ్బిలి పట్టణంలో ఉన్న చైతన్య పాఠశాలకు బస్సు నడుపుతున్నారు. ఇద్దరు విద్యార్థులకు ఒక సీట్ చొప్పున కేటాయించి, బస్సును నడుపుతున్నామని యాజమాన్యం పిల్లల తల్లిదండ్రులకు చెబుతుంది. అయితే, 42 మంది విద్యార్థులు ప్రయాణించాల్సిన బస్సులో దాదాపు 65 నుంచి 70 వరకు పిల్లల్ని ఎక్కిస్తున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎదురెదురు సీట్ల నడుమ చెక్కలను వేస్తున్నారు. ఒక్కో సీట్లో ముగ్గురు, నలుగురు చొప్పున కూర్చోపెడుతూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గతంలో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఇదే పరిస్థితి కొనసాగిస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. రవాణా శాఖ ఉన్నతాధికారులు స్పందించే వెంటనే పరిమితికి మించి పిల్లలను తరలిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రయివేటు స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి సురేష్

మండలాభివృద్ధికి అధికారులు సహకరించాలి

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించాలని, గత ప్రభుత్వంలో పనిచేసిన మాదిరిగా ఉంటే ఊరుకునేది లేదని ఎంపిపి బొంగు సురేష్ అధికారులకు హుకుం జారీచేశారు. బుధవారం ఎంపిడిఒ శ్రీనివాసరావు అధ్యక్షతన ఎంపిపి ఛాంబర్‌లో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి దత్తి లక్ష్మణరావు, డొంకాడ రామకృష్ణ హాజరయ్యారు. ఇంతవరకు ఒక లెక్కని, ఇకపై మరో లెక్కని అధికారులపై దత్తి బెదిరింపులకు దిగారు. మండలంలో ఉపాధి హామీ, వెలుగు సిబ్బంది ప్రభుత్వ నిధులను ఇష్టారాజ్యంగా దోచుకున్నారని మండిపడ్డారు. అధికారులంతా తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. డొంకాడ రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీలో అనేక అవకతవకలు జరిగాయని, వాస్తవంగా పనిచేసిన వారికి బిల్లులు అందించడంలో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా తమ బాని మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని బెదిరించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఒ తిరుపతిరావు

విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయ పాఠాలు

ప్రజాశక్తి-పాచిపెంట

విద్యార్థులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. పాచిపెంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్ జానకి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి జీవవైవిధ్యం పెంపొందించే విధంగా రసాయన ఎరువుల స్థానంలో జీవన ఎరువులను వినియోగించాలన్నారు. దీనిద్వారా భూమి ఆరోగ్యం బాగుపడి పర్యావరణ పరిరక్షణతో పాటుగా జీవ వైవిధ్యాన్ని పెంపొందించవచ్చని తెలిపారు

నవధాన్యాల సాగుతో భూసారం

నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని, పశువులకు నాణ్యమైన పశుగ్రాసం లభిస్తుందని జిల్లా ప్రకృతి సేద్య ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు తెలిపారు. చెరుకుపల్లి గ్రామంలో సవరాల జయమ్మ, పెంకి తిరుపతి వేసిన పది ఎకరాల నవధాన్యాల సాగును ఆయన పరిశీలించారు. నవధాన్యాల సాగువల్ల నేలలో నీటి నిల్వ సామర్థ్యం, పోషకాల లభ్యత పెరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు మరియు ఎన్ ఎఫ్ ఎఫ్ లు పాల్గొన్నారు


మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూదేవి

పవన్‌కు రుణపడి ఉంటాం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూదేవి

ప్రజాశక్తి-సీతంపేట

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు గిరిజన ప్రజలు, రైతులు రుణపడి ఉంటారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి అన్నారు. బుధవారం టిడిపి నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డిప్యూటీ సిఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. పవన్ కళ్యాణ్ పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే గిరిజన పంచాయతీలలో పంచాయతీ భవనాల నిర్మాణం, ఉద్యాన పనులకు ఉపాధి హామీని అనుసంధానం చేసే ఫైల్ పై సంతకాలు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా పవన్‌కి గిరిజనులు, రైతులు రుణపడి ఉంటామని భూదేవి అన్నారు.

ఉపాధిపై సమీక్ష

ప్రజాశక్తి-సీతంపేట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీపై ఎంపిడిఒ గీతాంజలి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఉన్నతి పథకం గురించి వివరించారు. వంద రోజులు పూర్తి చేసుకున్న జాబ్‌కార్డ్ కుటుంబాల్లో ఉన్న పిల్లలకు ఈ పథకం అమలు అవుతుందన్నారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సీతంపేట వైటిసిలో నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అందుకోసం సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా వైటిసిలో నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రతి పంచాయతీలో పని లక్ష్యం పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. హార్టికల్చర్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పారం పౌండ్స్ కట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సాగర్ బాబురావు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ పాండురంగ, తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు వాహనాలపై కొరడా

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో ఆర్‌టిఒ, ఆర్‌టిసి అధికారులు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణంలో నిలుపుదల చేసి ఉన్న ప్రయివేటు వాహనాలను బయటకు పంపించారు. కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో ప్రయివేటు వాహనాలు కనిపిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎల్విన్‌పేట, పి.లేవిడి గ్రామాల ప్రధాన రహదారిపై ప్రయాణించిన ప్రైవేటు వాహనాలను ఎంవిఐ జి.సత్యనారాయణ తనిఖీ చేశారు. ఓవర్ లోడ్ వాహనాదారులకు పత్రాలు సరిగ్గా లేకపోవడం వారిపై కేసు నమోదు చేశారు. వాహనాలు నడిపేటప్పుడు అన్ని అనుమతులు కలిగి ఉండాలని, అతివేగంతో వాహనాలు నడపరాదని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని , ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌టిసి డిఎం దుర్గమ్మ పాల్గొన్నారు.

ఉగాదినాయుడు కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ మండలం భాసూరు గ్రామానికి చెందిన పొట్నూరు ఉగాది నాయుడు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ బుధవారం పరామర్శించారు. మృతుని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈయన వెంట గ్రామ సర్పంచ్ ప్రతినిధి గురునాయుడు, వైస్ ఎంపిపి కనపాక సూర్య ప్రకాష్, వైసిపి సీనియర్ నాయకులు పాలవలస ధవళేశ్వరరావు, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-కొమరాడ

కొమరాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను బుధవారం జెడ్‌పి మాజీ చైర్మన్ గులిపల్లి సుదర్శన్ రావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి బొంగు భానోజీరావు, బూత్ ఇన్‌ఛార్జి పాలక నూకరాజు, ఎం.వెంకట్ నాయుడు, పారి నాయుడు, అలబోయిన సూరి, జనసేన చంటి పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రిపై

గత ప్రభుత్వ నిర్లక్ష్యం

- వైద్యులు సేవా దృక్పథంతో పని చేయాలి
- ఏరియా ఆస్పత్రిని పరిశీలించిన మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే పట్టణంలోని వందపడకల ఆస్పత్రి నిర్మాణంలో జాప్యం జరిగిందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి చెప్పారు. బుధవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని ఆమె పరిశీలించారు. వివిధ వార్డుల్లో ఉన్న రోగుల వద్దకు వెళ్ళి ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్న తీరు, మందులు ఉచితంగా అందిస్తున్నారా? లేదా, భోజనం ఎలా ఉందని ప్రశ్నించారు. దీనికి రోగులు సంతృప్తికరమైన సమాధానం చెప్పడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రిని పరిశీలించారు. 2019 ఫిబ్రవరిలో టిడిపి ప్రభుత్వం వంద పడకల ఆస్పత్రిని మంజూరు చేసిందని, వెంటనే శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. నిర్మాణానికి 17 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినా తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో నిర్మించలేదని చెప్పారు. ఐదు కోట్ల మేర బిల్లులు పెండింగులో ఉండడం వల్ల కాంట్రాక్టర్ నిర్మాణం పూర్తి చేయలేదని చెప్పారు.

సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి వందపడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయిస్తామని తెలిపారు. ఆసుపత్రిలో రోగుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెప్పారు. 30 పడకల ఆసుపత్రిలో వందల సంఖ్యలో రోగులు వున్నారని, ఒకే బెడ్ మీద ఇద్దరు ముగ్గురు రోగులు ఉండడం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. ఇక్కడ నుంచి ఎక్కువగా విజయనగరం, విశాఖపట్నం ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, ఇక నుంచి అలా జరగకూడదని హెచ్చరించారు. సరిపడిన స్థాయిలో నిపుణులైన వైద్యులు, సిబ్బంది ఉన్నప్పుడు ఎందుకు రిఫర్ చేస్తున్నారని ప్రశ్నించారు. మహిళలకు సిజేరియన్ ఆపరేషన్లు ఇక్కడే చేయాలన్నారు. మందుల కొరత, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. వైద్యం అందక ఏ ఒక్కరూ చనిపోయిన సందర్భాలు రాకూడదన్నారు.


రోగులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను ప్రయివేటు ఆసుపత్రులకు తరలించడం మానుకోవాలని సూచించారు. అలాంటి సంఘటనలు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే మహిళా రోగుల్లో ఎక్కువగా రక్తహీనత, పోషకాహార లోపం ఉన్నాయని చెప్పారు. ఇలాంటి సమస్యలతో వచ్చిన గిరిజన గర్భిణులకు సిజేరియన్ ఆపరేషన్లు చేయడం కష్టతరమైన పని అన్నారు. రక్తహీనతతో ఉన్న గిరిజన రోగులకు రక్తదాతలు లేకుండా రక్తం సరఫరా చేయడం సాధ్యం కాదని చెప్పారు. బ్లడ్ బ్యాంక్, న్యూట్రిషన్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ వినోద్, డిసిహెచ్ఎస్ డాక్టర్ గౌరీశంకర్, పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాను నిర్మూలించాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

సికిల్ సెల్ ఎనీమియాను నిర్మూలించుటకు ప్రతిఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. జాతీయ సికిల్ సెల్ ఎనీమియా డే సందర్భంగా బుధవారం ఐటిడిఎ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన, ప్రత్యేక నిర్ధారణ కేంద్రం కార్యక్రమాలకు ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభావిత గిరిజన ప్రాంతాలలో 40 ఏళ్లలోపు వారిలో ఈ వ్యాధి గల వారిని గుర్తించేందుకు జులై మూడో తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా అంటువ్యాధి కాదని, వంశపారపర్యంగా వస్తుందని తెలిపారు. దీనిని ముందుగానే గుర్తించి తగు చర్యలు తీసుకోవడం ద్వారా భావితరాలకు సంక్రమించకుండా కాపాడుకొనుటకు అవకాశం ఉంటుందని తెలిపారు. డిప్యూటీ వైద్యఆరోగ్య అధికారి శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికి 100 మందికి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. మూడు రోజులుగా చేపట్టిన పరీక్షలలో 214 మందిలో ఈ లక్షణాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ పి.మురళీధర్, ట్రైబల్ వెల్ఫేర్ డిడి రుక్మాంగదయ్య, ఐటిడిఎ మేనేజరు యు.వి.పద్మనాభరాజు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



సీతంపేట.. మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, ఐసిడిఎస్, వైద్య సిబ్బంది

సీతంపేట : మండల కేంద్రంలో అధికారులు, ఐసిడిఎస్, వైద్య సిబ్బంది, విద్యార్థులు సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఐటిడిఎ వద్ద మానవహారం నిర్వహించారు. పూతికవలసలో కార్యదర్శి శివాజీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఒ వెంకటేష్, తహశీల్దార్ మహేశ్వరరావు, ఎంపిడిఒ గీతాంజలి, సిడిపిఒ రంగలక్ష్మి, డిపిఒ వై.సతీష్ కుమార్, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్, ఇఒపిఆర్‌డి కె.సత్యం, ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ, ఎఎంఒ కోటిబాబు, తదితరులు పాల్గొన్నారు. సీతంపేట గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.పద్మశ్రీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వసతిగృహ అధికారి పాలక అమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి


ఆక్రమణలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్


పట్టణ పరిధిలో వరహాల గెడ్డ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర.. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. బుధవారం వరహాల గెడ్డపై నిర్మిస్తున్న అనధికార నిర్మాణాలను, బైపాస్ రోడ్డు పరిధిలో ఉన్న ఆ గెడ్డ గట్టుపై ఉన్న ఆక్రమణలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరహాల గెడ్డపై నిర్మాణాలు చేపట్టేందుకు ఇరిగేషన్ అధికారులతోపాటు రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖల పర్మిషన్ కూడా తీసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించకుండా ఇరిగేషన్ శాఖ అనుమతితో అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే, సంబంధిత శాఖ అధికారులు కనీస పర్యవేక్షణ చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అన్ని శాఖల అధికారులు కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బార్నాల సీతారాం, గొట్టాపు వెంకట్ నాయుడు, కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, నాయకులు సారికి గణేష్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రాస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు

పార్వతీపురంరూరల్ : పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాస్పత్రిలో ఎమ్మెల్యే విజయచంద్ర బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఉద్యోగుల పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధులకు వచ్చే వైద్యులు కనీసం హాజరు పట్టికలో సంతకాలు కూడా చేయకపోవడంపై మండిపడ్డారు. రోగులకు ఇచ్చే ఆహారంలో నాణ్యత కరువైందని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇక్కడికి వచ్చే రోగులు ఆరోగ్యం మెరుగుపడాలని వస్తారు, కానీ ఇక్కడ ఆహారం తిన్నవారు తిరిగి రోగాల బారిన పడే పరిస్థితి ఉందని ఎమ్మెల్యే అన్నారు. మరి కొద్ది రోజుల్లో ఈ పరిస్థితిని చక్కదిద్దకపోతే బాధ్యులైన వారిని చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాగ్దేవి, ఆర్‌ఎంఒ శ్యామల, ఎఒ మీసాల శ్రీధర్, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

పెదపెంకిలో విజయోత్సవ వేడుకలు

బలిజిపేట : మండలంలోని పెదపెంకి గ్రామంలో టిడిపి నాయకులు పెంకి వేణుగోపాల నాయుడు ఆధ్వర్యాన విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ చంద్ర మాట్లాడుతూ బలిజిపేట అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలపై దృష్టి సారిస్తానని చెప్పారు. ఏ సమస్యలున్నా మండల ప్రజలు నేరుగా తనను కలవచ్చని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాంబాబు, బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.


సుబ్బారావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

సుబ్బారావు సేవలు మరువలేనివి

ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

ప్రజాశక్తి-సీతంపేట

ప్రధానోపాధ్యాయులు కొండగొర్రె సుబ్బారావు సేవలు మరువలేనివని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు బుధవారం ధోనుబాయి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలలో బుధవారం ప్రధానోపాధ్యాయులు కొండగొర్రె సుబ్బారావు ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయకృష్ణ ఏజెన్సీలో సుబ్బారావు సుమారు 35 ఏళ్లుగా గిరిజనులకు సేవలు అందించారని కొనియాడారు. మారుమూల గిరిజన గ్రామాల్లో సైతం గిరిజన విద్య కోసం పాటుపడ్డారని చెప్పారు. అనంతరం సుబ్బారావు దంపతులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎపిఒ గణేష్, మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్, ఎటిడబ్ల్యు మంగవేణి, డిప్యూటీ డిఇఒ పాలక నారాయుడు, ప్రధానోపాధ్యాయులు చంద్రరావు , ఐటిడిపి కన్వీనర్ హిమరక పవన్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు గొంటి గిరిధర్, దండు ప్రకాశ్, జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు, గౌరవ అధ్యక్షులు ఎ.భాస్కర్‌రావు, మండల నాయకులు కె.సింహాచలం, ప్రిన్సిపల్ యుగంధర్, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఎస్ఐ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

ఏకలవ్య పాఠశాలల్లో ప్రారంభం కాని తరగతులు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఈ నెల 13న జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు పున:ప్రారంభమయ్యాయి. కానీ జిల్లాలోని ఐదు ఏకలవ్య పాఠశాలల్లో ఇప్పటికీ తరగతులు ప్రారంభం కాలేదు. గత డిసెంబర్ నెలలో ఎంపికైన ఉపాధ్యాయులు నేటికీ విధుల్లో చేరకపోవడం, గెస్ట్‌టీచర్లను విధుల్లోకి తీసుకోకపోవడమే కారణంగా తెలుస్తోంది. జిల్లాలో ఇదివరకు 70 మంది గెస్ట్ టీచర్లు విధులు నిర్వహించేవారు. త్వరితగతిన క్లాసులు ప్రారంభమయ్యేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వెబ్‌సైట్‌లో రికార్డులు

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ప్రతి రికార్డునూ వెబ్‌సైట్‌లో కచ్చితంగా పొందుపరచాలని జిల్లా గణాంక అధికారి శంకరరావు అన్నారు. బుధవారం ఆయన చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఎఎస్ఒ కిరణ్ కుమార్‌తో కలిసి ఆన్‌లైన్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల్లో అందిస్తున్న అన్ని సేవలను ఒకే ఫార్మేట్‌లో పొందుపరిచేలా చూడాలన్నారు. హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం అనే విధానంలో ప్రతినెలా ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను పొందుపరిచే వెబ్సైట్లో ఆన్‌లైన్ చేయాలన్నారు. ప్రజలకు ఆసుపత్రి ద్వారా అందిస్తున్న మందులు, పరీక్షలకు సంబంధించి పరికరాలు క్షుణ్ణంగా పరిశీలించారు. 2023 -24 ఆర్థిక సంవత్సరంలో అందించిన సేవలతోపాటు 2024 -25 ఆర్థిక సంవత్సరంలో ఇంతవరకు అందించిన సేవలు రిపోర్టులను తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రి నిర్వహణలో ప్రతి విషయంపై సమగ్ర పరిశీలన చేశారు. అనంతరం ఈ రిపోర్టులను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తే ఏ అంశాలకు ఎంత బడ్జెట్ అవసరమో నిర్ణయిస్తుందని తెలిపారు. ఈ నెల 25లోగా జిల్లాలో ఉన్న మూడు సిహెచ్‌సిలు, మూడు ఏరియా ఆసుపత్రులు, జిల్లా కేంద్ర ఆసుపత్రి పూర్తి పరిశీలన చేసి రిపోర్టులను పంపిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేయాలి

ప్రజాశక్తి-సీతానగరం

అన్ని పంచాయతీలలోనూ పారిశుధ్య పనులు చేయాలని ఇఒపిఆర్‌డి కె.కె.కుమార్ వర్మ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే ముందు గ్రామాలలో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాలలో అభివృద్ధి పనులకు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో సిసి రోడ్లు, కాలువ నిర్మాణం పనులు చేపట్టాలన్నారు.


రాళ్లు తేలిన జరడ రహదారి

రహదారి ఇలా..

మరి ప్రయాణం ఎలా ?

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో గిరిశిఖర పంచాయతీ జరడ గ్రామానికి వెళ్లే బిటి రహదారి అధ్వానంగా తయారైంది. పూర్తిగా గుంతలు, రాళ్లు తేలిన రహదారితో గిరిశిఖర గ్రామాల గిరిజనులు నరకయాతన అనుభవిస్తున్నారు. నీలకంఠాపురం పంచాయతీ నుండి జరడ గ్రామానికి సుమారు 10 కిలోమీటర్ల దూరం. ఈ రహదారి పొడవునా గుంతలు ఏర్పడి, రాళ్లు తేలాయి. పంచాయతీకి ఆనుకొని సుమారు 9 గ్రామాలు ఉన్నాయి. ఏ అవసరమైనా, నిత్యావసర సరుకులు కొనుక్కోవాలన్నా నీలకంఠాపురం గ్రామానికి వారంతా వెళ్లాలి. రహదారి బాగున్నప్పుడు ఆటోలు, జీపులు తిరిగేవి. రహదారి పాడైపోవడంతో వాహనాలు తిప్పడంలేదు. ద్విచక్ర వాహనం కూడా చాలా కష్టంగా వెళుతుందని గిరిజనులు చెబుతున్నారు. అత్యవసర సమయంలో 108 వాహనం కూడా రాలేదని వాపోయారు. డోలిమోత ద్వారా నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే అధికారులు స్పందించి రహదారి సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

వెంకన్న సన్నిధిలో జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

తిరుపతిలో వెంకటేశ్వర స్వామిని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆమె వెంట టిడిపి నాయకులు అడ్డాకుల నరేష్, పోలూరు శ్రీనివాసరావు, సంతోష్ ఉన్నారు.


వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే జగదీశ్వరి

రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-సీతానగరం

సీజనల్ వ్యాధులతో ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహనరావు.. వైద్యులను ఆదేశించారు. సీతానగరం పిహెచ్‌సిని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ల్యాబ్‌ను తనిఖీ చేశారు. సీజనల్ జ్వరాలతో ఆసుపత్రికి ఎవరైనా వస్తున్నారా, వారికి చేపట్టిన నిర్ధారణ పరీక్షలు, ఆరోగ్య తనిఖీలు తదితర వివరాలపై ఆరా తీసి రికార్డులు పరిశీలించారు. మలేరియా నిర్ధారణకు మైక్రోస్కోప్ పరీక్షా విధానం పక్కాగా నిర్వహించాలన్నారు. క్షేత్ర స్థాయిలో సేకరించిన రక్త పూతల స్లైడ్స్ సకాలంలో పరీక్షలు చేసి ఫలితాలు వెల్లడించాలన్నారు. జ్వరాలు నమోదు అయితే తగు చికిత్స అందజేసి తర్వాత క్షేత్రస్థాయి సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు.

అత్యవసర మందులు, కుక్కకాటు, పాము కాటు ఇంజక్షన్లు లభ్యతను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం వార్డులో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, తగు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి. నిహారిక, ఎఎంఒ సూర్యనారాయణ, సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న డిఎంఒ జగన్‌మోహనరావు